## ఒంటరి ఏనుగు స్వైర విహారం



రామకుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండలంలోని పంద్యాలమడుగు అటవీ ప్రాంతం సమీపంలో ఒంటరి ఏనుగు స్వైర విహారం చేస్తోంది. సోమవారం రాత్రి సమీపంలో రైతులు సాగు చేసిన పంటలను, వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేసింది. పట్టపగలే పంటలపై దాడులు చేస్తోంది. దీంతో రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ అధికారులు, సిబ్బంది ఏనుగు దారి మళ్లింపుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ క్షణాన ఏమూలనుంచి ఒంటరి ఏనుగు దాడికి తెగపడుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



## విద్యుత్ షాక్‌తో రైతుబలి



పెళ్లకూరు ఆగస్టు 5 ప్రభాతవార్త :

మండలంలోని నందిమాల గ్రామానికి చెందిన రైతు పేరువాయి మునెయ్య (49) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పొలంలో వైర్లు తెగి పడిపోయి ఉన్నా, విద్యుత్ శాఖ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా రైతు ప్రాణం పోయిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. గతంలో కూడా చిల్లకూరులో ఇదే విధంగా విద్యుత్ షాక్ కు గురై తొమ్మిదవ తరగతి విద్యార్థి నిండు ప్రాణం బలి అయినా విషయం తెలిసిందే ఈ విధమైన ఘటనలు పట్ల విద్యుత్ శాఖ వారు నిర్లక్ష్యం వహించకుండా ఉండాలని ప్రజలు వాపోతున్నారు ఈ ఘటనపై పెళ్లకూరు ఏఈ ను వివరణ కోరగా సబ్ స్టేషన్ నుంచి ఎల్సీ తీసుకోకుండా రైతు సొంతంగా ఫీజు పెట్టుకోవడం వలన ప్రమాదం జరిగిందని తెలిపారు.

## దోష నివృత్తి పవిత్రోత్సవాలు

తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్తప్రతినిధి:





పలు రకాల సేవలు, నిత్యకైంకర్యాలు,, పూజల సమయంలో తెలిసీతెలియకో భక్తులు, ఆలయ సిబ్బంది వల్ల కలిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా చేపట్టే పవిత్రోత్సవాలు మంగళవారం మొదలయ్యాయి. ఉదయం శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామివారిని సంపంగి ప్రాకారంలోని పవిత్రమండపంలోని యాగశాలకి వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులు స్వామిఅమ్మవార్లు ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు పవిత్ర ప్రతిష్ట చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయ్యంగారు, చిన్నజీయ్యంగారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ ప్రధానఅర్చకుడు వేణు గోపాలదీక్షితులు, అర్చకులు

## వెటర్నరీలో ఏం జరుగుతోంది..!

### పాలన గాడి తప్పిందా ..అధ్యాపకులు విద్యార్థులలో పెద్ద ఎత్తున చర్చ

### రిజిస్ట్రార్ నియామకంపై వెల్లువెత్తుతున్న విమర్శలు





తిరుపతి విద్య, ఆగస్టు 5 ప్రభాత వార్త

ఉన్నత లక్ష్యాలతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలోనే ఏకైక పశు వైద్య విశ్వ విద్యాలయాన్ని తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. ఆ లక్ష్యాన్ని నీరు గారుస్తూ యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే విధంగా పాలన సాగుతోంది. ఇందులో భాగంగానే పూర్తి స్థాయి వీసీను నియమించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. డీన్లస్థాయి నుంచి అధికారుల వరకు గత ఏడాదిగా ఇంచార్జ్ పాలనే యూనివర్సిటీలో కొనసాగుతోంది. దీంతో నిబంధనలకు అనుగుణంగా పూర్తి స్థాయి నిర్ణయాలు తీసుకోలేక, గీతదాటి ఇంఛార్జు వివాదస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారు. అధికారులు రాజకీయ వైషమ్యాలతో గ్రూపులుగా ఏర్పడి యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే పరిస్థితిని తీసుకొచ్చారు. పాలకమండలి లేకపోయినా ఇంఛార్జ్ హోదాలో అధికారులు వివాదస్పద నిర్ణయాలు తీసుకోవడం పట్ల విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్ నియామకం**

వెటర్నరీ యూనివర్సిటీలో ఆరు నెలల కాల వ్యవధితో బోర్డు అనుమతులు తీసుకుంటామంటూ రిజిస్ట్రార్ను నిబంధనలకు విరుద్ధంగా నియమించినట్లు సోమవారం రాత్రి ఆగమేఘాల మీద గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు జారీ చేశారు. ఇంఛార్జ్ వీసీకు కేవలం మూడు నెలల కాల వ్యవధితో మాత్రమే రిజిస్ట్రార్ను నియమించే నిబంధన ఉంది. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగానో లేక అవగాహనరాహిత్యంతోనో ఆరు నెలల కాల వ్యవధితో రిజిస్ట్రార్ ను నియమించారు. ఆ హోదాకు అర్హులైన అధికారులు యూనివర్సిటీలో ఉన్నప్పటికీ గన్నవరం ఆ హోదాకు దిగుమతి చేసుకోవడం ఏమిటో అర్థం కాలేదని యూనివర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇంఛార్జ్ వీసీ తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పటికే చాలా వరకు నష్టపోయామని, ఇకనైనా పాలనను గాడిలో పెట్టడానికి పాలకమండలితో పాటు శాశ్వత వీసీను నియమించాలని పలువురు కోరుతున్నారు.

**వర్సిటీలో రాజ్యలమేలుతున్న కుట్ర రాజకీయాలు**

గడ ఏడాదిగా యూనివర్సిటీలో పరిశోధనలు పూర్తి స్థాయిలో స్థంభించిపోయాయి. రాజకీయ కుట్రలతో పాలన అస్తవ్యస్తంగా మారింది. యూనివర్సిటీలో అధికార స్థాయి పదువులన్నీ ఆ సామాజిక వర్గానికే చెందినవారే కావడంతో రాజకీయాలు తప్ప వర్సిటీ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివాదస్పద నిర్ణయాలతో పలు వురు బడుగు, బలహీన వర్గాల ఉద్యోగులు. అధ్యాపకులు భారీ స్థాయిలో నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం





### ముగ్గురు దుర్మరణం

తవణంపల్లె, ఆగస్టు 5 ప్రభాతవార్త:

మండలంలోని బెంగుళూరు-తిరుపతి సిక్స్‌లేన్ రోడ్డు తెల్లగుండ్లపల్లె వద్ద రోడ్డు ఆగి వున్న కంటైనర్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం సాయంత్రం జరగింది. స్థానిక ఎస్సై చిరంజీవి కథనం మేరకు వివరాలిలావున్నాయి. బెంగుళూరు ఎలక్ట్రానిక్ సిటికి చెందిన శ్రీకాంత్ (35), ఆతని తల్లి లక్ష్మీదేవి( 55), కుమారుడు శ్రియాన్(5) అనే వ్యక్తులు తిరుమల స్వామివారి దర్శనానంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈనేపథ్యంలో వారు ప్రయాణిస్తున్న కారు తెల్లగుండ్లపల్లె వద్ద ఆగి వున్న కంటైనర్‌ను అతి వేగంగా వెనువైపు నుండి బలంగా ఢీకొంది. దీనితో శ్రీకాంత్, అతని తల్లి లక్ష్మీదేవిలు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన శ్రియాన్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ఎస్సై తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే ప్రమాదం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఇదే ప్రాంతంలో ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరగడంతో పదుల సంఖ్యలో వ్యక్తులు మృత్యువాతపడ్డారు. దీనితో ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కల్వర్టును ఢీకొట్టిన కారు ..

### ఇద్దరు దుర్మరణం



చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:

కల్వర్టును కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన దుర్ఘటన మంగళవారం వేకువజామున ఐతేపల్లి సమీపంలో చోటుచేసుకున్నది. తిరుపతికి చెందిన లేమ (34), భర్త కార్తీక్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. లేమ సోదరుడి వివాహం కోసం ఇండియాకు చేరుకుని సోమవారం బెంగుళూరు ఎయిర్‌పోర్టు నుండి కారులో తిరుపతికి బయలుదేరారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి సమీపంలో కుక్కను తప్పించబోయిన డ్రైవర్ రాజేష్ (44) కారు అదుపుతప్పడంతో డివైడర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలపాలైన లేమను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ లేమ మృతి చెందినది. కార్తీక్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ నెల 13న తన తమ్ముడి వివాహం కోసం వస్తూ ప్రమాదవశాత్తూ మృత్యువాత పడటంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఎస్ఐ మురళీ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పక్కాగా పిల్లల రక్షణ, సంక్షేమ కార్యక్రమాలు

**- బాల్య వివాహాలకు అడ్డుకట్టకు చర్యలు**

**- పోక్సో, అత్యాచార బాధిత కుటుంబాల్లో ధైర్యం నింపడం నైతిక బాధ్యత**

**- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు**

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల్లోపు పిల్లల రక్షణ, సంక్షేమం పక్కా ప్రణాళికతో అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని సమావేశభవనంలో మంగళవారం మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా స్థాయి పిల్లల సంరక్షణ, సంక్షేమ కమిటీ సమావేశం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎస్పీ మణికంఠ చందోలుతో పాటు ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, డిఇఓ వరలక్ష్మీ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అనాధ పిల్లలు, చైల్డ్ లేబర్, బిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ నెల నుండి ప్రతి నెల పిల్లల అపహరణ, అత్యాచారాలు, వేధింపులకు సంబంధించిన వివరాలు అందించాలన్నారు. జిల్లాలో 8 నుండి 10 శాతం చైల్డ్ ప్రెగ్నెన్సీ కేసులు నమోదు అవుతున్నాయని, అబార్షన్లు జరుగుతున్నాయన్నారు. బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎంఎస్‌కెల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ పోక్సో, అల్యాచార బాదితుల కుటుంబాల్లో ధైర్యం నింపడం నైతిక బాధ్యత తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కొంతమంది చదవలేదని, మానసిక సమస్యలు వున్నాయని, బంధుత్వం తదితర కారణాలతో జిల్లాలో మైనర్లకు వివాహాలు చేస్తున్నారన్నారు. జిల్లాలో సమస్యాత్మకమైన 180 ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, ఇక్కడ కమిటీ సభ్యుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సివుందన్నారు. జిల్లాలో 80కి పైగా ప్రభుత్వ బాలికలు, మహిళల సంక్షేమ హాస్టళ్ళు వున్నాయని, వీటిని బయటవైపు నుండి సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. వీటితో పాటు ప్రైవేటు హాస్టళ్ళను సైతం పర్యవేక్షిస్తున్నామన్నారు. పోక్సో, అత్యాచార కేసులకు సంబంధించి కమిటీ సభ్యులు సమస్య జరిగిన ప్రదేశాలకు వెళ్ళి అసలైన బాధితుల వివరాలను నిర్ధారించడంలో సహకారం అందించాలన్నారు. మిషన్ ట్రేస్ కింద రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 18 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారిని పరీక్షించి స్టేట్‌మెంట్ రికార్డు చేసి వారికి చట్ట ప్రకారం న్యాయం చేయడం జరుగుతుందన్నారు.

**ప్రభుత్వ వసతి గృహాలలో కడా పిడి ఆకస్మిక తనిఖీలు**

కుప్పం ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పం పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలను మంగళవారం రాత్రి కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మరమ్మత్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హాస్టల్లో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం ,వసతుల గురించి ఆరా తీశారు. కాగా ఆట స్థలం లేదని విద్యార్థులు తెలపడంతో క్రీడా మైదానం ఏర్పాటుకు రెండు లక్షల రూపాయలను మంజూరు చేశారు.

## మామను హతమార్చిన అల్లుడు

**- భార్యనుంచి దూరం చేశారని ఆవేశం.. కుప్పంలో సంఘటన !!**

**-మామ అల్లుళ్లు తమిళనాడు వాసులు !!**

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త



తన భార్యను కాపురానికి రాకుండా దూరం చేశారని భావించి మామను అల్లుడు బండరాయితో కొట్టి హత మార్చిన సంఘటన మంగళవారం కుప్పం పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. అర్బన్ సిఐ శ oకరయ్య తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం పట్టణంకు చెందిన లక్ష్మి అనే మహిళ తన కుమార్తెను తమిళనాడు రాష్ట్ర o కృష్ణగిరికి చెందిన రాజ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేసింది. కాగా రాజ్‌కుమార్ భార్య ఏడు నెలల క్రితం డెలివరీ అయింది. అయితే మూడు రోజులకే తన భార్యను తనతో పాటు పంపాలని రాజ్‌కుమార్ అత్త లక్ష్మిని కోరగా అనంతరం కొనా ్నళ్లకు భర్త ఇంటికి వెళ్లిన లక్ష్మి కుమార్తె అనంతరం మరలా తన పుట్టింటికి చేరింది. ఈ నేపథ్యంలో సుమారు ఆర్నెల్ల కా లంగా తన భార్యను, తన కుటుంబాన్ని దూరం చేశారని అం దుకు కారణం మామ అయిన తమిళనాడు రాష్ట్ర o ధర్మపురికి చెందిన రామదాస్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం మద్యం తాగే నెపంతో మామ రామదాస్‌ను తనతో పాటు తీసుకెళ్లిన రాజ్‌కుమార్ కమతమూరు సమీపంలో చెరువు వద్ద తన మామ రామదాస్‌ను బండరాయితో మోది హతమార్చాడన్నారు. సంఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ

## హథీరాంజీ మఠం భూములలో రచ్చ రచ్చ

### ఇరువర్గాల మధ్య వాగ్వాదం



తిరుపతిరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త:

శ్రీ హథీరాంజీ బాబా మఠం భూములలో మంగళవారం కూడా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మాదంటే మాది అంటూ ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 13లో ఎకరా స్థలాన్ని కొచ్చి ఫ్యామిలి దగ్గర నుండి కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు రామసుబ్బారెడ్డి తెలపగా, అదే స్థలాన్ని 8సంవత్సరాలు క్రితం 32 పేదలు కొనుగోలు చేసినట్లు మహేష్ అనే వ్యక్తి తెలిపారు. కాగా మఠం భూమిని ఎవరు కొనుగోలు చేసినా చెల్లదని అధికారులు అంటున్నారు. అధికారి పార్టీకి చెందిన చంద్రగిరి నేత ఎకరాస్థలాన్ని చదునుచేసి, ప్లాట్‌వేసి విక్రయానికి పూనుకున్నట్లు సమాచారం. ఎనిమిది సంవత్సరాలు క్రితం కోనుగోలు చేసిన తమకు న్యాయం చేయాలని పేదలు వేడుకొంటున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగుతున్నసమయంలో హథీరాంజీమఠం అధికారులు రంగప్రవేశం చేసారు.

**మఠం భూములు ఆక్రమిస్తే...ల్యాండ్ గ్రాభింగ్ కేసు నమోదు**

హథీరాంజీ భూములలో శాంతిభద్రతలకు భంగం కలిగించినా... ఆక్రమణకు పాల్పడిన ల్యాండ్ గ్రాభింగ్ కేసు నమోదు చేస్తామని మఠం సూపరింటెండెంట్ కేశవులు తెలిపారు. మఠం భూములకు ఇంటిపన్ను, కరెంట్ మీటర్లు కూడా ఇవ్వరాదన్నారు. మఠం భూములలో అల్లరి మూకల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మఠం అధికారులు ల్యాండ్ క్లర్క్ సీతారామయ్య, సిబ్బంది మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐసర్‌లో 6వ స్నాతకోత్సవ సంబరాలు

**వాతావరణ కలుషితం చేయని తయారీని గుర్తించాలి**

**విజ్ఞానం అనంతం: సాధన అవసరం**

**పంచగన్య విధానాన్ని శాస్త్రీయ అధ్యనాలతో సమన్వయం చేయాలి**





స్నాతకోత్సవం సభలో అతిధులు, . హాజరైన విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త

2015లో శ్రీకాళహస్తికి సమీపంలో 256 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థ భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధనా సంస్థ పదవ వార్షికోత్సవం, ఆరవ స్నాతికోత్సవం మంగళవారం ఆవరణలో వైభవంగా సాగింది. ఈ సభలో 255 మంది విద్యార్థులకు డిగ్రీలను అందించారు. సభకు గవర్నర్స్ చైర్‌పర్సన్ ఝిల్లు సింగ్‌యాదవ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా గోదావరి రిఫైనరీస్ ఎండి మరియు చైర్మెన్ సమీర్ సోమయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణం అంటే వినటం శ్రావణం మాసం మంగళవారం ఏకాదశి రోజు మీరు పట్టాలు తీసుకుంటున్నారు. మీరు ఇక్కడ నేర్చుకున్న అంశాలను సమాజానికి ఉపయోగపడేటట్లు చేయాలి. ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానాన్ని సమాజాభివృద్ధికి సమన్వయం చేయాలి. ప్రతి ఒక్కటి అధ్యయనం చేయాలి. వ్యవసాయంలో సంప్రదాయ పద్దతులతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమ్మేళితం చేయాలి. సత్ఫలితాలు సాధించాలి. కర్నాటకలో ఓ రైతు ఎకరాకు 30టన్నులు చెరకు పండించే వారు. నేడు ఆ రైతు సంప్రదాయ పద్దతితో సాంకేతిక విజ్ఞానాన్ని సమన్వయం చేసి నేడు 130 టన్నులు పండిస్తున్నారంటే మనం అర్థం చేసుకోవాలని సోమయ్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు దిశ దెశ నిర్దేశం చేస్తూ స్వామి వివేకానంద సూక్తులను ఉటకాయిస్తూ నిజం పలకాలి ఆలోచనలు సత్ఫలితాలుగా ఉండాలి. సమస్య వచ్చినపుడు కుంగిపోకుండా పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు.



**పరిశోధనల్లో సమస్యలను పరిష్కరించాలి: ఝిల్లు సింగ్ యాదవ్**

స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించిన చైర్మెన్ ఝిల్లుసింగ్ యాదవ్ మాట్లాడుతూ సిలికాన్ ప్రాధాన్యతను వివరిస్తూ పలు అంశాలపై సమగ్ర పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. వ్యవసాయం స్థిరమైన రసాయన శాస్త్రం, సెమికండక్టర్లు, ఎంజైమ్ తయారిలో ముఖ్య సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. పర్యవరణాన్ని కలుషితం చేయని తయారి ప్రక్రియలను గుర్తించాలని యువ శాస్త్రవేత్తలను కోరారు. అలాంటి ఆవిష్కరణలు, దేశాన్ని అభివృద్ధి దిశలో నడుపుతాయని వివరించారు మంచి శాస్త్రవేత్తగా ఉండండి మీ జ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించాలని పిలుపు నిచ్చారు. వికసిత్ భారత్ దార్శికతను సాకారం చేసుకోనుటకు కీలక పాత్ర వహించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. సమావేశంలో డైరెక్టర్ సంతాన భట్టాచార్య పదేళ్ళలో సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థగా తీర్చి దిద్దుటకు ప్రయత్నిస్తున్నమన్నారు. తెలుగురాష్ట్రాలకు ఐసర్ తిరుపతి మార్గదర్శక రూపొంతం జరిగిందన్నారు. అందుకు ఎల్లప్పుడు కొత్త పరిశోధనలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో 255 మంది విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఇంద్రప్రిత్ సింగ్ కోహ్లి, లెఫ్టనెంట్ కమాండర్ హోమాన్సు శేఖర్, సిఎంఎ రమేష్‌లు దిశదెశ నిర్దేశం చేసారు. రిజిస్ట్రార్ ధన్యవాదాలు తెలిపారు.

## విశ్వగురువు స్థానం భారత్‌దే

**ధర్మానికి మూలం సంస్కృత భాష**

**మానవ జీవనన్నాని నడిపించే లివింగ్ లెగసీ సంస్కృతం**

**ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు**





తిరుపతి విద్య, ఆగస్టు 5 ప్రభాతవార్త

అన్ని రంగాలలో విశ్వగురువుగా భారత్ వెలుగొందుతోందని పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన బాష్యోత్సవ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబుతో కలసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఇందులో భాగంగా వర్సిటీలో ఏర్పాటు చేసిన అక్షర పురుషోత్తమ మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం ఎంతో మహోత్తరమైందని, ధర్మంతోనే మానవ జీవనం ముడిపడి ఉందన్నారు. సంస్కృత భాష ధర్మానికి మూలమని, భారతీయ జ్ఞాన పరంపర సంస్కృత భాషతోనే నిగూఢమైందన్నారు. నీతిశాస్త్రం, ధర్మశాస్త్రం, రాజనీతి శాస్త్రం, సర్వవిధదార్మికాంశాలు ఇందులోనే ఉన్నాయని చెప్పారు. సెంటర్ ఫర్ హిందూ స్టడీస్, స్పిరిచ్యువల్ కారిడార్స్, విధ్యార్థులకు ప్రతేక స్కాలర్ షిప్స్ సదుపాయాల గురించి వివరించారు. అనంతరం ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ సంస్కృత భాష మానవుని జీవనాన్ని నడిపించే లివింగ్ లెగసీగా కొనియాడారు. తన బాల్యంలో స్వస్థలం లోని కళాశాలలో సంస్కృత భాష బోధన ఉండేదని గుర్తు చేసుకున్నారు. దేవభాషను అధ్యయనం చేస్తున్నట్టు వంటి వర్సిటీకి రావడం ఆనందంగా ఉందన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ భారతాధి గ్రంధాలు ఈ భాషలోనే ఉన్నాయన్నారు. సంస్కృత భాష అధ్యయనంతో విస్తృత జ్ఞానం సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, సాధు భద్రేశదాస్ స్వామి, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సత్వరం స్మార్ట్ మీటర్లు రద్దు

## - చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

చిత్తూరుహెల్త్, ఆగస్టు 5 ప్రభాతవార్త:

విద్యుత్ ఛార్జీలు పెంపు వుండదని చెప్పనే మళ్ళీ ట్రూఅప్ పేరిట 12,771 కోట్ల రూపాయల భారం మోపడంతో సత్వరం స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల పిలుపు మేరకు మంగళవారం జిల్లా సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం, సిపిఎం నాయకులు నాగరాజు, గంగరాజులు మాట్లాడుతూ విద్యుత్ వ్యాపార లోటు పేరిట 12,771 కోట్ల రూపా



యల ట్రూఅప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ నియంత్రణా మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయన్నారు. ప్రభుత్వానికి తెలియకుండా ఇది జరుగదని, ప్రభుత్వం సత్వరం స్పందించి ఛార్జీల పెంపుదలను నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా ఇప్పటికే 3 వేల కోట్ల రూపాయల ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేశారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై 15,485 కోట్ల రూపాయల సర్దుబాటు ఛార్జీల భారం వేశారన్నారు. అలాగే 2024–25 సంవత్సరానికి ప్రతి నెల యూనిట్‌పై 40 పైసలు వసూలు చేసి ఒక సంవత్సరంలోనే 2,787 కోట్ల రూపాయలు వసూలు చేశారని ధ్వజమెత్తారు. సిపిఐ నాయ కులు గోపినాథ్, మణి, దాసరి చంద్ర, విజయగౌరి, జమిలాబీ, రమాదేవి, విజయకుమార్, కోమల, రఘు, లత, గజేంద్ర పాల్గొన్నారు.

## మణీంద్రం ఎంపిటిసి ఎన్నిక ఏకగ్రీవం

రామకుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త



మండలంలోని మణీంద్రం ఎంపిటిసి సెగ్మెంట్ ఎన్నిక ఏక గ్రీవమైనట్లు ఆర్వో లక్ష్మీకాంత్ తెలిపారు. మంగళవారం నాటికి నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. కాగా మణీంద్రం ఎ ంపిటిసిగా తెదేపా అభ్యర్థి అరుణ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు సంబంధించి వైకాపా తరపున అభ్యర్థి దాఖలు చేసిన నామినేషన్ తిరస్కారానికి గురికావడంతో ఇక బరిలో మిగిలిన అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఎంపిటిసి అరుణకు ఆర్వో ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. అన ంతరం ఎంపిటిసి అరుణను టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, సీతాపతి, నందారెడ్డి, కామరాజునాయక్, రవిరెడ్డి, విజయ్‌రెడ్డి, రామలింగారెడ్డి, బాలరాజు, సుబ్రి, ఆదిల్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీమోహన్ తదితరులు ఘనంగా సత్కరించారు.

## మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ

వి.కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త



మండల మహిళా సమాఖ్య, డిఆర్‌డిఎల అధ్వర్యంలో మహిళలకు మంగళవారం తెదేపా నేతలు పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో యూనిట్ విలువ రూ 3100లు అన్నారు. పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, ఎపిఎం లావణ్య, వెలుగుసిసిలు, మహిళలు పాల్గొన్నారు.

## రైతు ఆత్మహత్యాయత్నంపై ఆర్డీఓ విచారణ

వి.కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త



భూవివాద సమస్యపై తనకు న్యాయం చేయాలని సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద వి.కోట మండలం నడమంత్రం గ్రామానికి చెందిన రైతు చౌడప్ప ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయం విదితమే. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకుమంగళవారం పలమనేరు ఆర్ీ ు ఒ భవాని వి.కోటకు చేరుకుని తహశీల్దార్ ఉదయ్‌సంతోష్‌తో సమస్యపై చర్చించారు. అనంతరం చౌడప్పకు సంబంధించిన భూములను పరిశీలించారు. భూరికార్డులు కూడా రెవెన్యూ కార్యాలయంలో పరిశీలించారు. ఈ వ్యవహారంపై మరింత విచారణ జరిపిన అనంతరం జిల్లా కలెక్టరుకు నివేదిక అందిస్తామని ఆర్డీఓ తెలిపారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

పూతలపట్టు, ఆగస్టు 5, ప్రభాతవార్త



పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మండల కేంద్రమైన మంగళవారం పూతలపట్టులో జిల్లా ఎమినైజేషన్ అధికారి హనుమంతరావు, వైద్యాధికారి పూజిత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ఆరు మాసాలపాటు చిన్నారులకు తల్లిపాలు పట్టించడం ద్వారా వారు ఎలాంటి అంటువ్యాధులకు గురికాకుండా కాపాడుతుందని వారు పేర్కొన్నారు. తల్లిపాల ఆవశ్యకత గూర్చి గర్భిణీలకు బాలింతలకు వివరించి చిన్నారులకు తల్లిపాలు పట్టించడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు తల్లి బిడ్డ మధ్య ప్రేమానుబంధాలు బలపడతాయన్న విషయాన్ని వారికి వివరించాలన్నారు. చాలామంది పిల్లలకు పాలు ఇస్తే వారి అన్నం తగ్గిపోతుందన్న ఉద్దేశంతో పాలు ఇవ్వడం లేదని పిల్లలకు పాలు పట్టించకపోవడం వలన ఆ తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని ఇది ప్రతి ఒక్క మహిళ గుర్తించాల్సిన విషయమని ర్యాలీ సందర్భంగా వారు నినాదాలు చేస్తూ అవగా కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## అతిధులకు సన్మానం

తొట్టంబేడు, ఆగస్టు 5 ప్రభాతవార్త





తిరుపతి ఐసర్‌లో మంగళవారం స్నాతకోత్సవానికి హాజరైన అతిదులను మేనేజ్‌మెంట్ సత్కరించింది. ఐసర్ 6వ స్నాతకోత్సవం, పదవ వార్షికోత్సవానికి సభాధ్యక్షులుగా బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఛైర్‌పర్సన్ ఖిల్లు సింగ్ యాదవ్ హాజరయ్యారు. అలాగే గోదావరి బయోరిఫైనరీ లిమిటెడ్ ఛైర్మెన్ సోమయ్య విద్యావిహార్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సమీర్‌సోమయ్యలు హాజరయ్యారు. అంగరంగవైభవంగా నిర్వహించిన స్నాతకోత్సవం సుమారు నాలుగు గంటల పాటు సాగింది. ఈ సమావేశంలో విద్యార్థులకు దిశ దేశ నిర్దేశం చేసిన అతిథులకు ఐసర్ డైరెక్టర్ భట్టాచార్య సారథ్యంలో సత్కరించారు. అతిథులకు దుశ్శాలువతో సత్కరించారు. వారికి మెమొంటోలు అందించారు.

## ఏరియా ఆసుపత్రిలో తల్లి పాల వారోత్సవాలు:

తొట్టంబేడు, ఆగస్టు 5 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో మంగళవారం తల్లి పాలవారోత్సవాలను రోటరీ క్లబ్ నిర్వహించారు. ఆసుపత్రిలోని బాలింతలకు బ్రేడ్, బిస్కెట్, పండ్లను అందించారు. రోటరీ సభ్యులు తల్లులను చైతన్యవంతుల్ని చేస్తూ తల్లి పాలు అమృతతుల్యమని విశిష్టతను తెలిపారు. పుట్టిన బిడ్డలకు తప్పని సరిగా తల్లి పాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షులు పి.పార్థసారధి, కార్యదర్శి పి.సుధాకర్, ఏరియా సూపరింటెండెంట్ మణి, రోటరీ సభ్యులు కండ్రిగ ఉమ, డాక్టర్ లక్ష్మీనారాయణ, విజయకుమార్, చెంగారెడ్డి, ఎస్వీఆర్ ప్రసాద్, సిద్దులుగారి బాలాజి, డాక్టర్ వెంకటరమణ, మ్యాగీక్లారా, ఆసుపత్రి అబివృద్ధి కమిటి సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిల అభ్యున్నతి దేశం లక్ష్యం

శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త



రాష్ట్రంలోని బిసిలను దారిద్రరేఖ నుంచి బయటకు తీసుకొచ్చి అభివృద్ధి పరచటమే లక్ష్యంగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని బిసి నాయకుడు డాక్టర్ ఉమేష్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం బిసిల అభ్యున్నతి కోసం ఇచ్చిన మాట మేరకు గీత కులాల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా వారికి మద్యం షాపుల్లో రిజర్వేషన్ హామీని నిలబెట్టుకుంటూ రాష్ట్రం లోని యాత గౌడ, ఈడిగ, గౌడ్, గవండ్ల కలాలి, శ్రీశైన, పిగిడి కులాలకు 335మద్యం దుకాణాలలో 10శాతం కేటాయించి, బార్లులో కూడా పది శాతం కేటాయించుటకు నిర్ణయం తీసుకోవటం హర్షణీయం అన్నారు. ఈకార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచ్చారి, మిన్నలరవి, మునిరాజాయాదవ్, వజ్రం కిషోర్, వేమాల భాస్కర్, భగత్, మణి మురళికృష్ణ, కృష్ణమూర్తి, మురళినాయుడు, సులేమాన్, శివ, చంద్రమౌళి, సిరాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట ఎన్నికల ప్రచారంలో గువ్వల

చౌడేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త

కడప జిల్లా ఒంటిమిట్ట ఎన్నికల ప్రచారంలో తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డిలు ఒంటిమిట్ట స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో గువ్వల పాల్గొని కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. ఆయన ప్రచారం చేస్తున్న తీరు వారిని ఆకర్షిస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒంటిమిట్ట కోదండరామస్వామిని దర్శించుకొన్నారు.

## కొత్తపేట ప్రాంత అభివృద్ధికి చర్యలు

### – ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని కొత్తపేట ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీ పెద్దపల్లి గంగమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో కొత్తపేట ప్రాంత అభివృద్ధిపై ప్రజలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం పట్టణాన్ని మోడల్‌గా మార్చాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రత్యేక ప్రణాళికతో కొత్తపేట ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. నేతాజీ రోడ్డుతో పాటు పెద్దపల్లి గంగమ్మ ఆలయ వీధి ప్రాంతాలను విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన కొత్తపేట ప్రజలు తాము అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, నేతలు సత్యేంద్రశేఖర్, మునెప్ప, తిరుమగళ్, డికెపల్లి మణి, వాసు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మన మిత్రతో ప్రజలకు ఎంతో ఉపయుక్తకరం

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబు నాయుడు చేపట్టిన ఇ – గవర్నెన్స్ విధానంతో మనమిత్ర సేవలు ప్రజలకు ఎంతో ఉపయుక్తకరమని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రెండో సచివాలయంలో ఇ–గవర్నెన్స్, ప్రభుత్వ వాట్సప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 9552300009 నెంబరుకు వాట్సప్ చేస్తే ప్రజలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి సేవలు వాట్సప్‌లోనే ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, డిఇలు గురవారెడ్డి, పురుషోత్తం, నేతలు సికె మణి, మంజు, శ్యాంసుందర్, ఆర్ఆర్ రవి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో కెడిసి విద్యార్థుల ప్రతిభ

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త







తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు కాలేజ్ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. బికాం (సిఎ)లో హరీష్ 9.35పాయింట్లు, బిసిఎలో ప్రియాంక 9.05, భావన 9.05, బిఎస్సీ (సిఎస్)లో పూర్ణిమ 8.45, బిబిఎలో సింధు 8.40, బిఎస్సీ (కెమిస్ట్రీ)లో పళని 6.80 పాయింట్లతో కళాశాలలో టాపర్లుగా నిలిచారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.

## ప్రలోభాలకు గురి చేయాల్సిన అవసరం లేదు : వైకాపా

చౌడేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త



ఎవరినీ పార్టీలోకి రావాలని ప్రలోభాలకు గురిచేయాల్సిన అవసరం వైకాపాకు లేదని ఆపార్టీ మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి అన్నారు. తేదేపా నాయకుడు కుమార్‌రాజ ఇటీవల వైకాపాలో చేరి మరలా అదే పార్టీకి వెళ్ళే క్రమంలో ప్రలోభాలకు గురి చేశారన్న క్రమంలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో మండల వ్యాప్తంగా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కుమార్‌రాజు తానంతట తానే వచ్చి పార్టీలోకి వస్తానని కోరగా ఆహ్వానించామే కానీ ఎలాంటి ప్రలోభాలకు గురిచేయాలేదనీ, తేదేపా అధికారంలో వుంటే తమేమి ఆశపెడతామన్నారు. పార్టీ ఫిరాయించే క్రమంలో చౌకబారు మాటలు అనడం సరికాదన్నారు. సర్పంచు జయసుదమ్మ, వైకాపా నాయకులు రుక్మిణమ్మ, సుధాకర్‌రెడ్డి, చెంగారెడ్డి, సాధిక్‌భాషా, రవిచంద్రారెడ్డి, జంగాలపల్లి రమణ, వెంకటేష్‌రాజు, మనిరాజు, ఓబుల్‌రెడ్డి, షంషీర్, శంకరప్ప, కృష్ణమూర్తి, వైకాపా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## సామాన్యుని చేతిలో పాశుపతాస్త్రసం సమాచారచట్టం : లీలామాధవి

చౌడేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త

సామాన్యుని చేతిలో సమాచార హక్కు చట్టం(2005) పాశుపతాస్త్రం వంటిదని ఎంపిడిఓ లీలామాధవి అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సమాచారహక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి సంబంధించిన విషయాలు ఇతరత్రా వ్యవహారాలను ఎవరైనా సమాచారచట్టం ప్రకారం కోరితే 30రోజుల్లోగా ఇవ్వాలన్నారు. అధికారులందరూ విధిగా గుర్తించుకొని అడిగిన సమాచారాన్నందించాలన్నారు. అనంతరం చట్టం యొక్క విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యాలయ సూపరిండెంటెంట్ షబ్బీర్ అహమ్మద్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కోవిడ్ బాధిత పిల్లలకు మిషన్ వాత్సల్య అండ

### – జిల్లాలో 21 మందికి సహకారం – కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:



కోవిడ్ మహమ్మారి బారిన పడి తల్లిదం డ్రులను కోలో ్పయిన పిల్లలకు భరోసా కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య కార్యక్రమంను చేపట్టి అమలు చేస్తున్నాయని, బాధితులకు ప్రభుత్వం అండగా వుంటుం దని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కోవిడ్ బాధితులు, వారి సంరక్షకులతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులు ఇరువురిని కోల్పోయిన 21 మంది పిల్లలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వీరికి ఒక్కొక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి 20 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. మిషన్ వాత్సల్య ద్వారా బాధిత పిల్లల ఆరోగ్యం, విద్య తదతర అంశాలపై శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన లోటు తీర్చలేమని, కష్టాలను అధికమించి ముందుకు వెళితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. బాధితుల సంరక్షకుల వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అవసరమైన ప్రభుత్వానికి నివేదించి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోస్ట్ ఆఫీసు పాస్‌బుక్‌లను బాధితులకు కలెక్టర్ అందజేశారు. ప్రభుత్వం అందించిన సహకారంతో బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని కలెక్టర్ కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జిల్లా రాయల్ ఫీపుల్స్ ప్రంట్ అధ్యక్షులుగా జికె.నాగరాజు నియామకం

వెదురుకుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



చిత్తూరు జిల్లా రాయల్ ఫీపుల్స్ ప్రంట్ అధ్యక్షులుగా జికె.నాగరాజును నియమించిన్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి శేఖర్ రాయల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియా జేస్తూ, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శేఖర్ రాయల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ బలిజ, కాపు సామాజిక వర్గాల బలోపే తంకు కొరకు నిరంతరం కృషి చేసి వారి హక్కులు సాధన కోసం పనిచేయడం జరుగుతుందన్నారు. తనపై నమ్మకం వుంచి పదవి ఇచ్చిన రెడ్డి శేఖర్ రాయల్‌కు, బలిజ సంఘం సీనియర్ నాయకులు గోపి రాయల్‌కు పలువురు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

### ఎంపిడిఓ రాజశేఖర్ బాబు

కల్లూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త



సామాన్యుడికి సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిదని ఎంపీడీవో రాజశేఖర్ బాబు అన్నారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సమాచార హక్కు చట్టం ప్రజలు వినియోగించే విధానం సమాచారం తెలిపే విధానం తదితర వాటి గురించి సమగ్రంగా వివరించారు. గ్రామాలలో సమాచార చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలన అధికారి మునిరాజు, డిప్యూటీ ఎంపీడీవో హరి తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ జయరామయ్య

పులిచెర్ల, ఆగస్టు 5, ప్రభాతవార్త



కల్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ జయరామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కల్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న సూర్యనారాయణ చిత్తూరు ఎస్‌బికు బదిలీ పై వెళ్లగా చిత్తూరు ఎస్‌బిలో ఉన్న జయ రామయ్య కల్లూరు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## విద్యుత్ ఘాతానికి పాడి ఆవు మృతి

పుంగనూరు రూరల్, ఆగస్టు 5, ప్రభాతవార్త



మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం విషాదకర సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చిరంజీవి, భార్య మౌనిక కలిసి పాడి ఆవును మేతకు తోలుకొని వెళ్తుండగా గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ తీగలు రోడ్డుపై పడిపోవడంతో ఆవు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటి సమయంలో విద్యుత్ షాక్ తగిలిన రైతు దంపతులు స్వల్ప గాయాలతో బయటపడినప్పటికీ, తమ పాలదూది మృత్యువాత పడడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర స్థితిలో ఉందని గతంలోనే విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా, స్పందన లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

## జర్నలిస్టుల న్యాయపరమైన సమస్యలకు పరిష్కారం

### – జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరికి ఎపియూడబ్ల్యుజె నాయకులు వినతి

చిత్తూరుహెల్త్, ఆగస్టు 5 ప్రభాతవార్త:



జర్నలిస్టుల న్యాయపరమైన సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యూజె నాయకులు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. చిత్తూరు జిల్లా ఎపిడబ్ల్యూయుజె, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎపియూడబ్ల్యుజె నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇంటి పట్టాలు, ఆరోగ్య, ప్రమాద బీమా వర్తింపు, విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్ స్కీమ్ అమలు తదితర న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎపియూడబ్ల్యుజె అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకనాథం, మురళీకృష్ణలు, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, కాళేశ్వర్‌రెడ్డి, పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పిఎం రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

### కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుహెల్త్, ఆగస్టు 5 ప్రభాతవార్త:

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్–2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలితకళలు, వినూత్నమైన సేవల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన 18 సంవత్సరాలలోపు వారు ఈ అవార్డుకు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## నైపుణ్యం వుంటే వెతుక్కొంటూ ఉద్యోగాలు

### – అపోలోలో అమెరికా ఐటి సంస్థ ప్రీ-ప్లేస్‌మెంట్ టాక్

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

నైపుణ్యం వుంటే ఉద్యోగాలు వెతుక్కొంటూ వస్తాయని ఆ మేరకు విద్యార్థులు నైపుణ్యంను సాధించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అమెరికాకు చెందిన ప్రముఖ ఐటి సంస్థ వివ్‌నోవేషన్ అపోలో యూనివర్సిటీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించింది. అపోలో యూనివర్సిటీలో మంగళవారం అమెరికా ఐటి సంస్థ ప్రీ–ప్లేస్‌మెంట్ టాక్ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివ్‌నోవేషన్ సంస్థ హెచ్‌ఆర్ హెడ్ డాక్టర్ లవనం అంబాల మాట్లాడుతూ తమ సంస్థ అమెరికాతో సహా పలు దేశాల్లో ఆరోగ్య రంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తోందన్నారు. డేటా విశ్లేషణ, మెడికల్ ఇన్‌ఫర్‌మేషన్, క్లయింట్ సపోర్ట్ వంటి విభాగాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా వున్నాయన్నారు. కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ ఇమ్రాన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ డి.జగదీశన్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ డాక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ రామయ్య ఇటుమల్ల తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ కమిషన్ దేవి విస్తృత తనిఖీలు

పుంగనూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త



పట్టణంలో మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల 15 షాపు చౌక దుకాణాలు, బాలికల వసతి గృహాలు. అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో తనిఖీ నిర్వహించారు. హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు, తాసిల్దార్ రాము, ఆర్ ఐ, సిడిపిఓ భారతి, అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంలో రాజుకాలువలు శుభ్రం

కుప్పంరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని రాజుకాలువలను మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో శుభ్రం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా రాజుకాలువల చుట్టూ చెట్లు ఏర్పడడంతో పాటు దోమలకు ఆవాసంగా మారేవి. ఈనేపథ్యంలో కమీషనర్ ప్రత్యేక చొరవ చూపడంతో ప్రస్తుతం రాజు కాలువలు శుభ్రం అవుతున్నాయి. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ సురేష్‌కుమార్ దగ్గరుండి హెచ్‌పి రోడ్డులో కాలువను జెసిబి సాయంతో శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## అపద్దాల పుట్ట చంద్రబాబు

**చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**



**రామచంద్రాపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** అపద్దాల పుట్ట చంద్రబాబు నాయుడని వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయలచెరువు కట్ట సమీపంలో ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరిట అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి మోసం చేశారని మండిపడ్డారు. నిజాయితీకి మారు పేరైన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సాధ్యమైన పథకాలనే ప్రజలకు అందివ్వాలని ముందుకెళ్ళారని కొనియాడారు. అదే చంద్రబాబు అపద్దపు హామీలతో అధికారంలోకి వచ్చి మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా లిక్కర్ కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు బాబు మోసాలను ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జ్యోతి, మాజీ ఎంపిపి దామోదర్ రెడ్డి, నాయకులు యశ్వంత్ రెడ్డి, మురగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే రాష్ట్ర ప్రగతి

**టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు**




రామచంద్రాపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త: విద్యతోనే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు అన్నారు. మంగళ వారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో కమ్మపల్లి పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నాలుగు గోడల మధ్య నిర్మితమవుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యశించి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. గొప్ప సంకల్పంతో ముందుకు వెళ్ళి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్ నాయుడు, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ దేవరాజులు, గ్రామస్థులు ఉమా నాయుడు, కిషోర్, హెచ్ఎం భాను, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసిన తహసిల్దార్...

*రేణిగుంట ఆగస్టు 5 ప్రభాతవార్త*



రేణిగుంట మండలం గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధి. లోని సంజీవరాయ పట్టెడ (ఎస్సార్ పట్టెడ) ప్రాంతం లో మంగళవారం రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆకస్మిక దాడులు నిర్వహించి నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. వీటిని తహసిల్దార్ కార్యాలయానికి తరలిం చారు. ఇటీవల కాలంలో రేణిగుంట రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై పంజా విసిరారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న పలు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ క్రమంలో సంజీవ రాయ పట్టెడ వద్ద నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండలంలో భూకబ్జాలు, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలలో ఉపేక్షింపమన్నారు. అలాంటి వారిపై కఠినమైన చర్యలతో పాటు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి కేసులు నమోదు చేస్తామన్నారు. తహసిల్దార్ తో పాటు దాడుల్లో ఆర్ ఐ జయ కృష్ణ ఉన్నారు.

## స్మార్ట్ మీటర్లు వద్దు... ప్రజలపై భారం మోపొద్దు.. సిపిఐ..

రేణిగుంట ఆగస్టు 5 ప్రభాతవార్త



స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై అధిక విద్యుత్ చార్జీల భారం మోపొద్దని సిపిఐ పార్టీ నేతలు రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళ వారం ఆగస్టు 11వ తేదీ ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారత రాజ్యాంగ నిర్మాతకు ఘనంగా నివాళులు అర్పించారు. అటు పిమ్మట రేణిగుంట మండల సిపిఐ నాయకులు జిల్లా సిపిఐ కార్యదర్శిగా ఎన్నికైన మురళిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి ఎలాంటి కేసులు లేకుండా చేస్తామని తెలిపిన తెలుగు దేశ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని తప్పు పట్టారు. ఆగస్టు నెల 11వ తేదీ జరిగే ధర్నాని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, వివిధ పార్టీలకు చెందిన నేతలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయలక్ష్మి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, మండల నాయకులు కార్తీక్, సెల్వ, సుబ్బరాజు, చంద్రకళ, అమ్ములు, భాను, రమణ, తదితరులతోపాటు మండల సిపిఐ కార్యదర్శి వైయస్ మనీ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి.....

రేణిగుంట ఆగస్టు 5 ప్రభాతవార్త



మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం తద్వారా గ్రామలు దేశాలు ఆర్థిక పురోగతి సాధిస్తాయని రాస్ డైరెక్టర్ మోహన్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి ఇందిరానగర్ రాస్ మహిళ జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయం నందు రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఆదేశాల మేరకు పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు సూచనలతో సోమవారం మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను రాస్ డైరెక్టర్ మోహన్ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణను ఇచ్చి వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్నామని మోహన్ తెలిపారు. 90 రోజుల ట్రైనింగ్ పూర్తయిన తర్వాత శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారి ఆర్థిక పురోగతికి సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాస్ జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ట్రస్టీ నిత్య సుధా, మురళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఇందుమతి, జ్యోతి, నాగమణి, స్వాతి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు...

## నేటి నుంచి శుకబ్రహ్మాశ్రమంలో ధార్మిక కార్యక్రమాలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన శుకబ్రహ్మాశ్రమం సారధ్యంలో నేటి నుంచి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ధార్మిక కార్యక్రమాలకు సంబంధించి ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి సామి మంగళవారం వివరిస్తూ ప్రతి ఏడాది సమాజంలోని యువకులను చైతన్య పరచుటకు మన సంప్రదాయాలు, పురాణాలు,ఇతిహాసాలకు సంబంధించి అవగాహన కల్పించుటకు ధార్మిక క్రమామాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. బుధవారం నుంచి 12 వ తేది వరకు గజేంద్ర మోక్షం ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉపన్యాసాలను 7రోజుల పాటు తిరుపతికి చెందిన బ్రహ్మశ్రీ శతావధాని ఆముదాల మురళి అందిస్తారని తెలిపారు. విద్యావికాస పరిషత్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమూలు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సప్తాహం పానగల్‌లోని బిపి ఆగ్రహారం మధ్యరామమందిరంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు.కాగా చాతుర్మస వేదాంత ప్రవచనాలను వేదాంత పంచదశి కార్యక్రమాలను ఏడు రోజుల పాటు శుకబ్రహ్మాశ్రమంలోని శివాలయం వేదికగా నిర్వహించబడుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ఈ ప్రవచనాలను కూడా తిరుపతికి చెందిన బ్రహ్మశ్రీ శతావధాని ఆముదాల మురళి నిర్వహిస్తారని పీఠాధిపతి తెలిపారు.

## రైతుల సమస్యలను పరిష్కరించండి

తొట్టంబేడు ఆగస్టు 5 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని మాజీ మండలాధ్యక్షులు గాలి.ము రళీనాయుడు తహశీల్దార్ భారతి,డిప్యూటితహశీల్దార్ జీవన్‌కుమార్‌లకు విన్నవించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు, ప్రజలు రెవెన్యూ సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్యాలయానికి వచ్చే వారికి వవెంటనే సమస్యను పరిష్కరించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన వివరించారు. ప్రజలు అధికంగా భూ సమస్యలతో సతమతమౌతున్నారని మురళినాయుడు విన్నవించారు.ఆన్‌లైన్లో పొందు పరిచే పత్రాలను తహశీల్దార్ కార్యలయంలో త్వరగా పరిష్కరించే విధంగా,పట్టాపాస్‌పుస్తకాల సమస్యలను పరిష్కరించేవిధంగా చూడాలన్నారు.రైతుభరోస పథకం కొంతమందికే జమ అయ్యాయని మరి కొంత మంది జమ కాలేదని ఆయన వాపోయారు.అదేవిధంగా వర్షాలకు నష్టలను చవిచూసిన రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించేవిధంగా చూడాలన్నారు.

## ప్రవచనాలకు అనుమతి లేదా? శివయ్యా!?

శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల తీరు రోజు రోజుకు ఆగమ్యగోచరంగా మారుతుందని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాటా ్లడుతూ శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమం సారధ్యంలో ప్రతి ఏడాది ఆధ్యాత్మిక ప్రవచనాలు,ధార్మిక ప్రసం గాలతో ముక్తి మార్గాన్ని సూచిస్తున్నారని, గతంలో తాను ఛైర్మెన్‌గా ఉన్నపుడే కాకుండా అంతకు ముందు కకూడా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దేవస్థానం కళ్యాణ మండపాలను కేటాయించే వారమని వివరించారు. గతంలో వరదరాజస్వామి ఆలయ ప్రాగంణం, ముత్యాలమ్మగుడిలోని కళ్యాణ మండపం శుకబ్రహ్మాశ్రమం నిర్వహించే ధార్మిక ప్రవచనాలకు అనుమతించే వారమన్నారు. భక్తులు,భగవద్గీత,రామాయణం, భారతం, భాగవతం,శివపురాణాలను వినే వారు.కానీ ఈ ఏడాది ఎందుకో ఇఓ బాపిరెడ్డికి కింది స్థాయి అధికారులు ఏం సమాచారం ఇచ్చారో ఏమోకానీ అనుమతి ఇవ్వకపోవటం గమనిస్తే ఇదేమి చోద్యం ముక్కంటీశా అని నొచ్చుకోవాల్సి వస్తుందని అంజూరు తారక శ్రీనివాసులు విమర్శించారు.శుకబ్రహ్మాశ్రమానికే కాకుండా ఏ ధార్మిక సంస్థకు అయినా అవకాశం ఇవ్వటానికి గతంలో ధర్మకర్తల మండలి తీర్మానం కూడా ఉందని ఇఓ కిందిస్థాయి ఉద్యోగుల నోట్‌యే శాసనంగా కాకుండా వాస్తవికతను పరిగణలోకి తీసుకోవాలన్నారు.

## ఆశ కార్యకర్తలు సేవలు అభినందనీయం : డాక్టర్ హేమభూషణ్‌రెడ్డి



పుత్తూరు రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త: ఆశ కార్యకర్తలు సేవలే అభినందనీయమని పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి హేమభూషణ్‌పేర్కొన్నారు. మంగళవారం ఆశడేని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించి వేపగుంట పంచాయతీలో పని చేస్తున్న ఆశ కార్యకర్త కరుణమ్మ పదవీ విరమణ పొందారు. అందుకు ఆమె సేవలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులందరూ కలసి ఆమెను ఘనంగా సన్మానించి కొంత నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి సాయి, సూపర్‌వైజర్ విజయమ్మ, ఉమాదేవి, ఏఎన్ఎంలు, పీహెచ్‌వోలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మనమిత్రను సద్వినియోగం చేసుకోండి - తహసీల్దార్

విజయపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:



మనమిత్ర(వాట్సాప్ గవర్నెన్స్)ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. మంగళ వారం మండల కేంద్రమైన విజయపురం సచివాలయ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. మనమిత్ర ద్వారా ప్రజల చేతిలో ప్రభుత్వం ఉందని, దేశంలో తొలిసారిగా ఏపీలో ఈ సేవలు ప్రారంభించారని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 9552300009 నెంబరుకు వాట్సాప్ ద్వారా హాయ్ మెసెజ్ చేస్తే 200లకుపైగా సేవలు అందుబాటులో ఉంటుందన్నారు.

## ఎమ్మెల్యే భానుప్రకాష్‌ని కలసిన సింగిల్‌విండో అధ్యక్షులు

విజయపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను మంగళవారం ఆయన స్వగృహంలో కోసలనగరం, అగరం రామ కృష్ణ సింగిల్‌విండో చైర్మన్‌లు బాబుయాదవ్, బాబు నాయుడులు కలిశారు. ఉత్తమ పీఏసీఎస్‌గా కోసల నగరం సింగిల్‌విండో ఎంపిక కావడంతో చైర్మన్, సీఈవోచంద్రమోహన్‌మంత్రిచేతులమీదుగా ప్రశంసా పత్రం,షీల్డ్అందుకోవడంతోవారినిఅభినం దించారు.

## శ్రీ చైతన్య స్కూల్లో ఇన్వెస్టిచర్ వేడుకలు

తిరుపతి విద్య ఆగస్టు 5 ప్రభాత వార్త



స్థానిక బైరాగిపట్టెడలోని శ్రీ చైతన్య స్కూల్లో ప్రిన్సిపల్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఘనంగా ఇన్వెస్టిచర్ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి.ఎస్.పి. శ్రీలత విచ్చేసి,తమ ఆదర్శవంతమైన జీవితానుభవాలను పంచుకున్నారు.ఆమె హాజరుతో విద్యార్థులందరికీ విశేష ప్రేరణ లభించింది.మరో ముఖ్యఅతిథిగా పాఠశాలల ఏజీఎం సురేష్ విచ్చేసి విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులుగా ఎంపికైన హెడ్ బాయ్,హెడ్ గర్ల్, హౌస్ క్యాప్టన్లు,ఇతర ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణ మాట్లాడుతూ,"నాయకత్వం అనేది బాధ్యత తీసుకోవడం, సహృదయతతో సేవ చేయడం,అని చెప్పారు. శ్రీలత మాట్లాడుతూ, "నైతిక విలువలతో కూడిన నాయకత్వం మీరు ఇప్పుడు నుండే అలవరచుకోవాలి.ఇది మీ జీవితానికి పునాది అవుతుంది," అని సూచించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు,విద్యార్థులు హాజరై విజయవంతం చేశారు.

## కంటైనర్ స్టేడియంను నిర్మించిన మోహన్ బాబు వర్సిటీ

తిరుపతి విద్య ఆగస్టు 5 ప్రభాతవార్త

మోహన్ బాబు వర్సిటీ (ఎంబియు) తిరుపతి క్యాంపస్‌లో భారతదేశపు మొట్ట మొదటి కంటైనర్ స్టేడియంను ఆవిష్కరించి,క్యాంపస్ మౌలిక సదుపాయాలను పునర్నిర్వచించడంలో ఒక సాహసోపేతమైన ముందడుగు వేసింది.ఈ మార్గదర్శక అభివృద్ధితో, ఉన్నత విద్యా మౌలిక సదుపాయాలలో సుస్థిరత,ఆవిష్కరణలకు ఎంబియు ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది.ఈ సందర్భంగా మోహన్ బాబు వర్సిటీ ప్రోఛాన్సలర్ విష్ణు మంచు మాట్లాడుతూ,"విదేశాలలో కంటైనర్ స్టేడియంలను నేను మొదటిసారి చూసినప్పుడు,వాటి చాతుర్యం,ప్రభావానికి నేను ఆశ్చర్యపోయాను అని అన్నారు. భారతదేశంలో ఏ విశ్వవిద్యాలయం కూడా ఇలాంటి ప్రయత్నం చేయలేదని నేను గ్రహించాను,మనం ఎందుకు చేయకూడదు? అని నేను అనుకున్నాను.ఆ క్షణం నుండి,ఈ దార్శనికతను నిజం చేయాలని నేను నిశ్చయించుకున్నాను.మా విద్యార్థుల కోసం క్రియాత్మకమైన, స్ఫూర్తిదాయకమైన, సుస్థిరమైన దాన్ని సృష్టించాలని అనుకున్నట్లు తెలిపారు. ఈ స్టేడియం అన్ని విధాలుగా దానిని అందిస్తుంది. ఇది ఒక ఉదాహరణగా నిలుస్తుందని, మౌలిక సదుపాయాలు ప్రజలకు, భూ గ్రహానికి ఎలా సేవ చేయగలవో, సృజనాత్మకంగా ఆలోచించడానికి ఇతరులను ప్రోత్సహిస్తుందని నేను ఆశిస్తున్నాను," అని అన్నారు.

## సర్పంచ్ చర్యలకు సర్వత్రా హర్షం

చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:



చంద్రగిరి సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి చర్యలకు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద కాలువపై వేసిన గ్రిల్స్ పాడవంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై అధికారుల స్పందన కొరవడటంతో సర్పంచ్ స్పందించి చర్యలు చేపట్టారు. గతంలో గ్రిల్స్ కొంత గేజ్ తక్కువ వుండటాన్ని గమనించి ఈ దఫా మెరుగైన గేజ్‌తో పాటు పటిష్టమైన నిర్మాణంతో గ్రిల్స్‌ను తయారు చేయించి అమర్చారు. ఈ మార్గంలో మురుగునీటి ప్రవాహం తరచూ ప్రజలను అసహనానికి గురి చేస్తుండగా సర్పంచ్ స్పందించారు. పైప్ లైన్ మార్పు చేసి శాశ్వత పరిష్కారం చూపడం ద్వారా సమస్యకు చెక్ పెట్టారు. మంగళవారం పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ భర్త రామమూర్తి పర్యవేక్షణలో గ్రిల్స్‌ను అమర్చారు. దీంతో వాహనచోదకులు, ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహనా ర్యాలీ

**సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి**

చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:




దేశంలోనే మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ప్రజల చేతిలో ప్రభుత్వం "వాట్సాప్ గవర్నెన్స్"పై ప్రజలు అవగాహన చెందాలని సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై మంగళవారం చంద్రగిరిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనమిత్ర వాట్సాప్ వినియోగం ద్వారా అనేక సేవలు లభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజలకు అవసరమైన సేవలను ఎంపిక చేసుకుని పొందవచ్చన్నారు. తద్వారా ఈ-ధృవీకరణ పత్రాలు, రశీదులు పొందవచ్చన్నారు. మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసెజ్ చేసి చాట్ సేవలను ప్రారంభించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సెక్రటరీ లావణ్య, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పనిచేయని సిబ్బంది తప్పుకోండి..!



**డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్**

రామచంద్రాపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త: ఉపాధిహామీ పనులలో సక్రమంగా పనిచేయని సిబ్బంది స్వచ్ఛంధంగా తప్పుకోవాలని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. మంగళ వారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు చేసిన పాపాలను కడగలేక చస్తున్నామన్నారు. అంచనాలు ఒకరి పేరిట చెల్లింపులు మరొకరి పేరిట చేయడమేంటని నిలదీశారు. అంచనాలు వేసిన ప్రదేశంలో కాకుండా పనులు మరొక ప్రదేశంలో చేయడం ఏమిటని ప్రశ్నించారు. పాత పనులకు బిల్లులు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించి, సభలో వెళ్ళడించారు. గ్రామసభల్లో భారీ స్థాయిలో అవినీతి వెలుగు చూసినా మండల స్థాయిలో రికవరీలు తక్కువ స్థాయిలో తేల్చడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. -ఉపాధిహామీలో అవినీతి రూ.2,29,120/-లుఉపాధిహామీ పనుల్లో రూ.2,29,120/-లు అవినీతి చోటుచేసుకున్నట్లు సామాజిక తనిఖీ బృందం వెళ్ళడించారు. ఈ నేపధ్యంలో ఒక జెఈ, ఇద్దరు టిఏలను సస్పెండ్ చేస్తూ పిడి ఆదేశాలు జారీ చేశారు. ఈ సభలో పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీ వివరాలను చదివి వినిపించారు. అత్యధికంగా సి.కె.పల్లి, గంగిరెడ్డి పంచాయతీలలో రూ.31 వేలు వంతున అవినీతి చోటుచేసుకోగా, అత్యల్పంగా సి.రామాపురంలో రూ.946/-లు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు.ఏపిడి రెడ్డెప్ప, డిడిఓ ఇందిర, ఎస్టీఎం పూనయ్య, ఎస్ఆర్‌పి రవి, ఏపిఓలు హంసవేణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతవైపు ఆనందం

తిరుపతిరవాణ,ఆగస్ట్ 5ప్రభాతవార్త



ఆధ్యాత్మికతవైపు పయనిస్తేనే అంతా మంచిజరుగు తుందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాపర్యటనలో భాగంగా మంగళవారం తిరుపతి పద్మావతి అతిధిగృహ: వచ్చారు.ఆయనకు బిజెపి నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, గుండాలగోపీనాథరెడ్డి, చంద్రారెడ్డి,తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా కలిశారు. టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి కూడా ఉన్నారు

# తిరుపతి డివిజన్

## దశాబ్ద కాలంగా ఇసుక దోపిడీలో "చెవిరెడ్డి రఘు"



**సత్యప్రమాణానికి సిద్ధమా సవాల్**

**స్థాయి మరచి విమర్శలు చేస్తే గుణపాఠం తప్పదు..!**

**మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా**

చంద్రగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త: దశాబ్ద కాలానికి పైగా ఇసుక దోపిడీ చేస్తున్నది చెవిరెడ్డి రఘునాధ రెడ్డి కాదా అంటూ చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా దుయ్యబట్టారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై కాణిపాకంలో సత్యప్రమాణం చేయడానికి తాను సిద్ధమని మీరు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. స్థాయి మరచి ఎంఎల్ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డిపై విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాలలో అందినకాడికి దండుకుంటూ చెరువులను తలపించే రీతిన ఇటాచీలు, జేసిబీలతో ఇసుకను తవ్వితీసి విద్యార్థుల ప్రాణాలను బలికొన్నది నిజ ం కాదా అంటూ నిలదీశారు. అదేవిధంగా తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల మాట్లాడుతూ ఏ మాత్రం ఇంగితం లేకుండా పులివర్తి నాని నాన్ లోకల్ అంటూ విమర్శించడంపై పులివర్తివారిపల్లి చంద్రగిరి నియోజకవర్గంలో వుందనే విషయం తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో వేల కోట్లు అవినీతి, గంజాయి బ్యాచ్‌లను పెంచి పోషించిన విషయాలను గుర్తు చేశారు. యూనియన్ టీడర్ ముసుగులో ఇసుక దందాతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టింది చెవిరెడ్డి రఘు కాదా అంటూ నిలదీశారు. నియోజకవర్గాన్ని సమర్థవంతంగా అభివృద్ధి నడిపిస్తున్న ఎంఎల్ఏపై మరోమారు అర్ధరహిత ఆరోపణలు, విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూర్ ధనంజయ రెడ్డి,ఎస్సీ సెల్‌జిల్లా నాయకుడు బాలసుబ్రమణ్యం, మండల నాయకుడు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఏడు గ్రామాల గంగజాతర వేడుకలకు చాటింపు

నారాయణవనం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



మండలంలోని నారాయణవనం, సముదాయం, కీళగరం, వెంకటకృష్ణాపాలెం, నాగిలేరు, బొబ్బరాజు పాలెం, నారాయణవనం1,2 వార్డులలో వచ్చేవారం అనగా మంగళవారం నుంచి రెండురోజుల పాటు గంగమ్మ జాతరను జరుపుకోవడం మంగళవారం రాత్రి చాటింపు జరిగింది. సాయంత్రం అమ్మవారి ఆలయం ఎదుట మహిళాభక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈనెల 12,13వ తేదీల్లో గంగజాతరను ఘనంగా జరపుకోవడం నిర్వాహకులు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లను చేస్తున్నారు. అయితే నారాయణవనం మేజర్ పంచాయతీలో మాత్రం బలిజ సంఘం ఆద్వర్యంలో చలపతిబాబు, శరత్‌కుమార్ దగ్గరుండి జాతరను నిర్వహించనున్నారు.

## బిల్డింగ్ వర్కర్స్‌లో ఆద్వర్యంలో ఘనంగా ధర్మరాజులస్వామి కల్యాణోత్సవం

నారాయణవనం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ది చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవరోజు మంగళవారం సాయంత్రం శడగోప్రవాహనంపై నారాయణవనం, బిసికాలనీ, రెడ్డివీధిలో ఘనంగా ఊరేగించారు. నారాయణవనం బిల్డింగ్ వర్కర్స్ అసోషియేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో సాయంత్రం స్వామివార్లను, అమ్మవారిని ట్రాక్టర్, అశ్వవాహనంపై ఘనంగా ఊరేగించారు. సాయంత్రం కల్యాణోత్సవం ఘన ంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ఉదయం స్వామి,అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయులురెడ్డి, నారాయణవనం బిల్డింగ్ వర్కర్స్ సభ్యులు, భక్తులు అధికస ంఖ్యలో పాల్గొన్నారు.

## కల్యాణవేంకన్న సన్నిధిలో ఘనంగా ఏకాదశి ఉత్సవ సందడి

నారాయణవనం, ఆగస్టు 5 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆల యంలో మంగళవారం ఏకాదశి ఉత్సవంతో భక్తుల సందడితో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సే వలతో మేల్కొలిపి, శుద్ది, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్రవ్యాలతో అబి షేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై స్వామి, అమ్మవారిని ఊరేగిం చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు.

## వసతి పెంపుకు కృషి చేస్తా

**విద్యార్థుల తల్లిదండ్రులతో టీటీడీ పాలకమండలి సభ్యుడు**



తిరుపతి విద్య ఆగస్టు 5 ప్రభాత వార్త పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు హాస్టల్ సీట్ల పెంపు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పెంచేందుకు కృషి చేస్తానని టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు.మంగళవారం కళాశాలను సందర్శించిన ఆయన సుదూర ప్రాంతాల నుంచి హాస్టల్ వసతి కోసం లగేజీలతో కళాశాల ఎదుట నిరీక్షిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.హాస్టల్ వసతి కోసం వేచి ఉన్నామని రాయలసీమ జిల్లాల నుంచి విచ్చేసి తల్లిదండ్రులు విన్నవించారు.టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.అనంతరం నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు.కళాశాలలో అవసరమైన భవనాలు,నూతన కోర్సులపై టీటీడీ యాజమాన్యంతో చర్చిస్తామని చెప్పారు. హాస్టల్స్ లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని,ఎంతో పేరుగాంచిన కళాశాలలో సీటు రావడం అదృష్టమని,విద్యార్థులు టీటీడీ కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వెంటనే ఆశా వర్కర్ల జీతాలు పెంచండి

*పాకాల, ఆగస్టు 5, ప్రభాతవార్త*



పాకాల మండలం దాముల చెరువు పిఎస్‌సిలో ఆశ వర్కర్స్ యూనియన్ సమావేశం మంగళవారం రోజున జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మి హాజరైయ్యారు. ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా వెంటనే గుర్తించాలని నిత్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీత భత్యాలు పెంచాలని అన్నారు. అదే విధంగా ఆశా కార్మికులను ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని పనికి తగ్గ ప్రతిఫలం వారికి ఇవ్వటం లేదని వారి కష్టానికి తగిన వేతనం ఇవ్వాలి అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, రోజా, మంజుల, ప్రమీల, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల చేతిలో ప్రభుత్వం కార్యక్రమం ర్యాలీ

పాకాల, ఆగస్టు 5, ప్రభాతవార్త




పాకాల మండలం స్థానిక చిత్తూరు రోడ్డు కూడలి వద్ద పాకాల పంచాయతీ సర్పంచ్ కుమారి కస్తూరి ఆధ్వర్యంలో మంగళవారం రోజున వాట్సాప్ గవర్నెన్స్ గురించి అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాకాల పంచా యతీ కార్యదర్శి బి.జనార్ధన్, స్థానిక సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా లేదా 9552300009 వాట్సప్ నంబర్ ద్వారా సంప్రదించి ప్రభుత్వం నుండి తమకు కావలసిన సేవలను సెల్ ఫోన్‌లోని వాట్సప్ సహాయంతో పొందవచ్చునని ఆగస్టు 15 మరిన్ని పౌర సేవలు అందుబాటులోకి వస్తాయని ద్వారా ప్రజలకు వివరించారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

*- డీటీ త్యాగరాజుకు వినతిపత్రం*

సత్యవేడు, ఆగస్టు 5 ప్రభాతవార్త: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్యవేడు మండల కేంద్రంలో డీటీ త్యాగరాజుకి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు పిలుపు మేరకు రాష్ట్ర కౌన్సిల్ మెంబరు నాగరాజు వినతిపత్రం సమర్పించారు. నాగరాజు మాట్లాడుతూపాత అక్రిడిటేషన్ గడువును ఇక ముందు పొడిగించకుండా జర్నలిస్టులందరికి కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని రాష్ట, జిల్లాస్థాయి అక్రెడిషన్ కమిటీల్లో జర్నలిస్టు యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పిస్తూ వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనాత్మకంగా తీర్చిద్ది స్కీమ్‌అమల్లో ఎదురవుతున్న సమస్యనఉ ఒకత్రైవాసిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తానన్న కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దినకరణ్, దొడ్డి శేఖర్, అంజిత్, ప్రింట్ ఎలక్ట్రానిక్స్, మీడియా విలేకరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు అవకాశంలేదు

గూడూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకంలో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నా యని, పనులు చేయకుండానే నిధులు స్వాహా చేస్తున్నారని, దొంగ మస్టర్లు నమోదు చేస్తున్నారనే విమర్శలు నేపథ్యంలో నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టం ఆధ్వర్యంలో ముఖ ఆధారిత హాజరు విధానం అమల్లోకి తెచ్చినప్పటికీ దొంగ మస్టర్లు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఏఐ ఆధారిత ముఖ హాజరు విధానాన్ని




ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలో గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో గూడూరు క్లస్టర్ పరిధిలో ఏడు మండలాలకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ వరప్రసాద్ రావు మాట్లాడుతూ ఏఐ ఆధారిత విధానంలో భాగంగా అప్ లోడ్ చేసిన ఫొటోలో ఎంతమంది ఉన్నారో గుర్తిస్తారు. చిత్రంలో ఉన్నవారికే మస్టర్లు వేస్తారు. జాబ్ కార్డు ఉన్న వ్యక్తి పనికి వచ్చిన వెంటనే ఆ కూలీ చిత్రాన్ని ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్లోడ్ చేస్తారని ఆయన తెలిపారు. ఈ సదస్సులో ఏపీఓ పెంచలయ్య పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నీటిగుంటలో వ్యక్తి మృతదేహం

వాకాడు, ఆగస్టు 5 ప్రభాతవార్త : మండలం కల్లూరు పంచాయతీ పరిధిలోని శివాలయం పక్కన వున్నా నీటిగుంటలో వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు మంగళవారం రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వీఆర్వో అరుణ పోలీసులకు సమాచారం అందజేశారు, స్థానికులు సహాయంతో నీటి గుంటలో పడి ఉన్న వ్యక్తిని పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి కల్లూరు గ్రామవాసి బల్లి చంద్రబాబు అని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజలను ఇబ్బంది పెడుతున్న పాలకవర్గం : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త: మున్సిపల్ సమావేశాలు నిర్వహించకుండా ప్రజలను పాలకవర్గం ఇబ్బంది పెడుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని 17వార్డు కలివేలమ్మ గుడి వీధిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల 31వ తేదీ జాతర ఏర్పాట్లపై అత్యవసర సమావేశం నిర్వహించాల్సి ఉండగా కౌన్సిలర్లు అందరూ హాజరు కాకుండా వాయిదా వేసినట్లు తెలిపారు. వైసిపి కౌన్సిలర్ల అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇక్కడున్న వైసీపీ నేతలకు అనుభవం లేనందున ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు నెల 15వ తేదీ నుండి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ సమావేశాలని వైసిపి కౌన్సిలర్లు వాయిదా వేయించడం వలన ప్రజలు నష్టపోతున్నట్లు తెలిపారు. త్వరలో జరగబో మున్సిపల్ ఎన్నికలలో టిడిపి ఘనవిజయం సాధిస్తుందన్నారు. సమావేశంలో కమిషనర్ వెంకట్రాంరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు ఆనందు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కొక్కటిగా హామీలు అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే పాశిం

కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త: ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం కోట మండలం రుద్రవరం, చంద్రశేఖరపురం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మండల టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. అడుగడుగునా మహిళలు ఎమ్మెల్యేకి హారతులు పట్టారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షన్ల పెంపు, దీపం పథకం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి హామీలను ఇప్పటికే తమ నాయకుడు



చంద్రబాబునాయుడు సంపూర్ణంగా అమలు చేశారని చెప్పారు. ఇంటింటికి వెళ్లి చేసిన అభివృద్ధిని కరపత్రాల ద్వారా తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, జలీల్ అహ్మద్, కోటేశ్వరరావు, నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, మండల టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎంఎస్‌రెడ్డి కోరారు. మంగళవారం జర్నలిస్టుల సమస్యలపై ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర యూని యన్ పిలుపు మేరకు సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయం ఏఓ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన జర్నలిస్టులు అందరికీ అక్రిడియేషన్లను మంజూరు చేయాలన్నారు. హెల్త్ స్కీంను ప్రయోగాత్మకంగా తీర్చిదిద్దాలని, ప్రమాద బీమాను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రెడ్డితో పాటు యూనియన్ సభ్యులు శశిధర్‌రెడ్డి, వేణుగోపాల్, మోహన్‌రాజురెడ్డి, సురేష్, సుధాకర్, గజేంద్ర, రమేష్, కిషోర్ పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతరకు కట్టుదిట్టమైన చర్యలు : సీఐ

వెంకటగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త : సెప్టెంబర్ నెల 10, 11వ తేదీల్లో జరగనున్న వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర రాష్ట్రస్థాయి పండుగ ఏర్పాట్లను వెంకటగిరి సీఐ ఏ.వి.రమణ, కార్యనిర్వహణ అధికారి అర్వభూమి ఏవి శ్రీనివాసులురెడ్డి, మాజీ దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, సభ్యులు వెంకట ముని, రాములు పరిశీలించారు. భక్తులకు సులభ రీతిలో



అమ్మవారి దర్శనం కలిగేలా అని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈ.ఓ తెలిపారు. అందరు సహకరించాలని కోరారు. ముందస్తు ఏరపోలేరమ్మ జాతర రాష్ట్రస్థాయి పండుగని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఈ.ఓ. సూచించారు. కొంతమంది వీఐపీలకు గత ఏడాది అసౌకర్యం కలిగిందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక క్యూ లైన్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సర్వదర్శనంతో పాటు రూ.100, 200, 500 దర్శనం టికెట్ల కొనుగోలు చేసి దర్శించుకోవచ్చు అన్నారు. సీఐ ఏ.వి.రమణ మాట్లాడుతూ ఆక్రమణలు ఉంటే తొలగిస్తున్నామన్నారు.

## మత్స్య కారులకు జీవనోపాధి కల్పించాలి : ఎంపీ



వెంకటగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త: ప్రాథమిక మత్స్యకార సహకార సంఘాలు ఎదుర్కొంటున్న జీవనోపాధి సవాళ్లపై తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి లోక్‌సభలో ప్రశ్నించారు. తీర ప్రాంతంతో సంబంధం లేని ప్రాథమిక మత్స్యకార సహకార సంఘాలు ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుంది, సహకార సంఘాల నిర్వహణలో అవకతవకలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏంటి అని వివరాలు కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర మత్స్య శాఖా సహాయ మంత్రి జార్జ్ కురియన్ సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద దేశవ్యాప్తంగా సహకార సంఘాల ఏర్పాటుకు కేంద్రం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ప్రాథమిక మత్స్యకారుల సహకార సంఘాలపై పాలకుల జోక్యాలను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులపై భారం

వెంకటగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త : స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులపై పెను భారం పడుతుందని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య తెలిపారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, పెరిగిన విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలన్న డిమాండ్లతో రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు ప్రజావేదికగా ఏర్పడి మంగళ




వారం విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నాలకు పిలుపునిచ్చింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని పిలుపునిచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు బిగిస్తూ విద్యుత్ చార్జీలు పెంచి భారాన్ని మోపిందన్నారు. సామాన్య జనం నుంచి స్మార్ట్ మీటర్ల బిగింపు మొదలు పెడితే వ్యతిరేకత వస్తుందని పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, షాపుల నుంచి బిగించుకుంటూ కిందకు వస్తున్నారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించి ప్రీపెయిడ్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ సుబ్బరాయుడు, జిల్లా నాయకులు జి కృష్ణారెడ్డి, చేనేతకార్మిక సంఘంనాయకులు సిహెచ్. చిన్నఓబయ్య, డి.భాస్కర్, పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డలకు అమృతం లాంటిది : సిడిపిఓ



వెంకటగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త : తల్లిపాలే పురిటి బిడ్డలకు అమృతం లాంటిదని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. మండలంలోని తిమ్మాయిగుంట అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు పురిటి బిడ్డకు ఇచ్చినందువల్ల బూస్ట్ ఫీడింగ్ ఇచ్చినట్టే ఉంటుందని తెలిపారు. సమావేశంలో టాటా సంస్థ ప్రతినిధి లక్ష్మి, అంగన్వాడి సిబ్బంది కుసుమ, లీల, సుప్రియ, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ అందని వారు సరిచేసుకోవాలి

వాకాడు, ఆగస్టు 5 ప్రభాతవార్త : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధి అకౌంట్లో జమ కాని రైతులందరూ స్థానిక రెవెన్యూ అధికారులను కలుసుకొని సరి చేసుకోవాలని వాకాడు డిప్యూటీ తహశీల్దార్ రఫీ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్నదాత సుఖీభవ రైతులకు విడుదల చేసిందన్నారు, మండలంలోని అన్నదాత సుఖీభవ, సీఎం కిసాన్ అందనివారు 1135 మంది రైతులు ఉన్నారన్నారు.మండలంలోని ఆయా గ్రామాల రైతులు అన్నదాత సుఖీభవ ఆగిన వారందరూ సంబంధిత రెవెన్యూ అధికారులను కలిసి సరిచేసు కోవాలని డిప్యూటీ తహశీల్దార్ సూచించారు.

## పూరిల్లు దగ్ధం గూడు కోల్పోయిన గిరిజనులు

పెళ్లకూరు ఆగస్ట్ 5 ప్రభాతవార్త : మండలంలోని కానూరు రాజుపాలెం గిరిజన కాలనీకి చెందిన పసుపు నాటి. శివయ్య, వెంకటమ్మ దంపతులకు చెందిన పూరిల్లు నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్ళగా శివయ్య వెంకటమ్మ దంపతులు తమ ఇద్దరు చిన్నపిల్లలతో ఒక పూరి గుడిసె ను నిర్మించుకుని కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవారు, వంట చేసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు నిప్పంటుకొని



ఇంటిలో ఉన్న బట్టలు, సామాగ్రి మిగిలిన అన్ని వస్తువులు మంటలో కాలిపోయాయని వారు తెలియజేశారు. మంటలు ఎక్కువగా రావడంతో చుట్టుపక్కల వారు చూసి మంటలను అదుపు చేశారు. ఈ సమాచారం ఎవరికీ ఇవ్వాలో తెలియక స్థానికులు ఇచ్చిన సలహాతో సోమవారం కలెక్టర్ ఆఫీసు నందు గ్రీవెన్స్‌లో తమ గోడు విన్నవించుకున్నారు.

## గురుకుల పాఠశాలలో మెగా వైద్య శిబిరం

గూడూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త : రెండవ పట్టణంలోని మినీ గురుకులంలో మంగళవారం విద్యార్థినులకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంటి రామ్మోహన్ రావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రోహిణి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సత్యశ్రీ, దంత వైద్య నిపుణులు డాక్టర్ నారాయణ, గైనకాలజీ డాక్టర్ కీర్తి నారా, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ త్రివిక్రమ్ రావు పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, సెక్రటరీ రాఘవరెడ్డి, సీనియర్ రొటీరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి,వాసు గౌడ్, బొమ్మిడి శ్రీనివాసులు, సనత్ రెడ్డి,ధనుంజయ రెడ్డి,నాసిన నాగులు, రవీంద్రనాథ్‌రెడ్డి,ఎం హరినాద్‌రెడ్డి, సిద్ధారెడ్డి,లక్ష్మీ నారాయణ, కృష్ణంరాజు, పి.హరినాద్‌రెడ్డి, నవీన్ జయకుమార్, హెడ్మాస్టర్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

## నిరసన తెలిపిన సిపియం నాయకులు



గూడూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త : పట్టణంలోని శాంతి నగర్‌లోని ఒకటో వార్డు సచివాలయం వద్ద మంగళవారం అదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సి.పి.ఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్బంగా సీపీయం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి జోగి.శివ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ బిల్లులు భారంగా మారాయని అదానికి కోట్లు కూడపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు టి.వెంకట రామిరెడ్డి, కెవిపిఎస్ ఎంబేటి చంద్రయ్య, అడపాల ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘంపుట్టా శంకరయ్య. గండి కోట మధు, బి.చంద్రయ్య, పామంజి మణి, ఏ.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లో అస్సాంకు చెందిన వ్యక్తి మృతి!

గూడూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త: గూడూరు రైల్వే స్టేషన్ లో మంగళవారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్ వైపు నుండి వచ్చి అస్సాంకు చెందిన వ్యక్తి మృతి చెందాడని సిఐ తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. గూడూరు రైల్వే స్టేషన్ లో మంగళవారం మధ్యాహ్నం గంటలకు రైల్వే స్టేషన్ వైపు నుండి వచ్చి అస్సాం రాష్ట్రంలోని కొక్రాఝర్ జిల్లాలో వున్న డింగడింగా గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు మృతుడు రైల్వే ఆర్చి వద్ద కూర్చున్న వెంటనే పడుకొన్నాడని తెలిపారు. ఆ తరువాత పక్కన టెంకాయల అమ్మే బండి అతను లేపితే లేవలేదని, 108 అంబులెన్సుకి కాల్ చేస్తే అంబులెన్సు వారు వచ్చి కామెర్లు వల్ల అతను చనిపోయారని చెప్పి వెళ్లిపోయారన్నారు. ఈ విషయం తమకు సమాచారం అందగానే అక్కడికి వెళ్లి మృతిడిని పరిశీలించగా అస్సాంలోని కొక్రాఝర్ జిల్లాలో వున్న కు డింగడింగా గ్రామం చెందిన నిర్మల్ ఛన్రా రాయ్ కుమారుడు రూపాక్ రాయ్ (23) అని మృతుని పర్సులో వున్న అడ్రస్, సెల్ ఫోన్ లో ఉన్న ఫోన్ నెంబర్ కి కాల్ చేసి మృతుని భార్యకి మరణించ్చినట్లు చెప్పి గూడూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్‌కి రమ్మని తెలియజేశామని తెలిపారు. కాగా మృతిడిని ప్రభుత్వ ఆసుపత్రిలోని శవాగారంకు తరలించామని సిఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

## విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు రాబట్టండి

పెళ్లకూరు ఆగస్టు 5 ప్రభాతవార్త : ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులలో కనీస సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయుల కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎం.శంకరయ్య తెలియజేశారు విద్యార్థులు వినడం చదవడం రాయడం, నిజజీవితంలో వాటిని వియోగించుకోవడం తదితర సామర్థ్యాల పైన, అలాగే మెరుగైన నైపుణ్యాల పైన ఉపాధ్యా యులు దృష్టి సారించాలని త్వరలో జరుగునున్న పరీక్షల లోపల సిలబస్ కంప్లీట్ చేయాలని, అలాగే వాటి ఫలితాలను స్టూడెంట్స్ అసెస్మెంట్ బుక్లెట్ నందు నమోదు చేయాలని తెలిపారు.



## సియంను కలిసిన ఎమ్మెల్యే



నాయుడుపేట,ఆగస్టు 5 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని పలు సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

## వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన

నాయుడుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త : పట్టణంలో మున్సిపాల్టీ కమిషనర్ పజులుల్లా ఆధ్వర్యంలో అధికారులు వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపాల్టీ కార్యాలయం నుండి వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తూ గాంధీ మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. వాట్సప్ గవర్నెన్స్ నెంబరు 9552300009కు హాయ్ అని మెసేజ్ చేయడం ద్వార రెండు వందలకు




పైగా ప్రభుత్వ సేవలు పొందవచ్చునని కమిషనర్ పజులుల్లా తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ మంత్రి రోజా



పుత్తూరు రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామివారికి మంగళవారం జరిగిన కల్యాణోత్సవంలో పట్టు వస్త్రాలు మాజీ మంత్రి రోజా సమర్పించారు. మాజీ మంత్రి రోజా భక్తిశ్రద్ధలతో చేసిన పట్టు వస్త్రాల సమర్పణ భక్తులందరిలో భక్తిభావం, ఆనందోత్సాహం నింపింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పుత్తూరు పట్టణ వైసీపీ నాయకులు, ద్రౌపదీదేవి ఆలయ కమిటీ సభ్యులు, స్థానికప్రజా ప్రతినిధులు మాజీ మంత్రి రోజాకి ఘన స్వాగతం పలికారు. .

## సిక్కిం సీఎంకు అపూర్వ స్వాగతం

రేణిగుంట ఆగస్టు 5 ప్రభాతవార్త: సిక్కిం రాష్ట్రం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ కు రేణిగుంట విమానాశ్రయంలో మంగళవారం రాత్రి ఘనంగా స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం రేణిగుంట చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు ప్రభుత్వ అధికారులు స్వాగతం పలికారు.తర్వాత ఆయన రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.

## ఐసర్‌లో విద్యార్థులకు పతకాల పంట





శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 5 ప్రభాతవార్త : తిరుపతి ఐసర్‌లో మంగళవారం పదవ వార్షికోత్సవం, ఆరవ స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొలిజియం హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో 255 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ముఖ్యఅతిథులు అందించగా కొందరు విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి బంగారు వెండి పతకాలను సాధించారు. వారిని స్నాతకోత్సవ సభలో అతిథులు సత్కరించారు. తిరుపతి ఐసర్ జాతీయ స్థాయిలో అనతి కాలంలోనే గుర్తింపు పొందటాన్ని అతిథులు ప్రసంశించారు. ఒక విద్యార్థి బంగారుపతకాన్ని సాధించగా మరో ఇద్దరు వెండి పతకాలను సాధించగా ఇద్దరు విద్యార్థులకు ఐసర్ బెస్ట్ స్టూడెంట్స్ అవార్డులను అందించారు. ఐసర్‌లో చదివిన 2020 సంవత్సరానికి చెందిన అనిష్ ముఖ పాండ్య బియస్-ఎంఎస్‌లో 9.7 సిజిపిఏ సాధించారు. బయాలజీలో 10 స్పెషలైజేషన్స్ సాధించారు.

ఇతను పలు ప్రాజెక్టులకు నిర్వహించారు.మూడు సెమిస్టర్లలో అత్యుత్తమ ప్రతిభ మరియు సిఎన్ఆర్ రావు అవార్డులను అందుకున్నారు. బెంగుళూరులోని ఐఐఎస్సిలో ప్రొఫెసర్ సుధాకుమారి పర్యవేక్షణలో అండాశయ క్యాన్సర్‌లో ఇమ్యూనోసప్రెషన్‌ఉ అధ్యయనం చేయ టానికి జనరేటింగ్ టూల్స్‌పై ఎంఎస్ థీసిస్ చేసారు. ఇండియన్ ఇమ్యూ నాలజీ సొసైటీ నిర్వహించిన ఇమ్యూనోకాన్ 2024 గ్లోబల్ ఇమ్యూనాలజీ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన ఎన్‌స్పైర్ షి,నేషనల్‌మ ఎరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ మరియు స్వామి వివేకానంద మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ నుంచి ఫెలో షిప్ పొందారు. బెంగుళూరులోని ఐఐఎస్సిలో పిహెచ్‌డి చేయాలనే యోచనలో ఉన్నారు.ఆయనకు స్నాతకోత్సవంలో సత్కరించారు.

**విష్ణు ప్రశాంత,విఘ్నేశ్వరలకు సిల్వర్ మెడల్స్:**

ఐసర్ 6వ స్నాతకోత్సవంలో మంగళవారం ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు కళాశాలలో ఇద్దరు విద్యార్థులు ఆర్‌సి విష్ణు ప్రశాంత్, ఆర్ విఘ్నేశ్వర్‌లను సత్కరించారు. విష్ణు ప్రశాంత్ గణితంలో స్పెషలైజేషన్‌లు అత్యధిక సిజిపిఏ 9.6తో బియస్-ఎంఎస్ ప్రోగ్రామం పూర్తి చేసారు. నాలుగు సెమిస్టర్లలో విద్యానైపుణ్యానికి అవార్డునుఅ ందుకున్నారు. ఆయన భోపాల్ ఐసర్‌లో ప్రొఫెసర్ కశ్యప్‌రాజీవ్ సారధి పర్యవేక్షణలో మ్యాపింగ్ క్లాస్ గ్రూప్స్ మరియు బెబ్రేయిడ్ గ్రూప్స్‌పై తన ఎంఎస్ థిసిస్ చేసారు. క్రీడాకార్యక్రమాల్లో కీలక పాత్ర వహించారు ఆర్.విఘ్నేశ్వరన్ భౌతిక శాస్త్రంలో స్పెషలైజేషన్ పొందిన గ్రాడ్యూయేట్లలో అత్యధికి సిజిపిఏ 9.5తో బియస్-ఎంఎస్ ప్రోగ్రామం పూర్తి చేసారు. ఆతను ఒక సెమిస్టర్‌లో ఆకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. సిఎన్ఆర్ రావు ఫౌండేషన్ డే అవార్డును అందుకున్నారు. ఆతను సిలికాన్ రాడ్ సంశ్లేషణపై తన వేసవి ప్రాజెక్టు చేసారు. 2022లో డాక్టర్ రవి కుమార్ పూజాల మార్గదర్శకంలో 2023లో మాక్స్‌పాన్లంక్ ఇన్సిట్యూట్ ఫర్ రేడియో అస్ట్రానమీ మరియు 2021 టైఫర్ మరియు ఐయుసిపిఏ నిర్వహించిన ఆర్ఏడబ్ల్యుఎస్ వింటర్ స్కూల్‌లో వ్యాపాలను సమీక్షించారు. భారత ప్రభుత్వం ద్వారా జర్మనిలో జరిగే లిండౌ నోబెల్ గ్రహీత సమావేశానికి విఘ్నేశ్వరన్ నామినేట్ అయ్యారు. 2023లో క్రీడల్లో జోనల్ టాపర్‌గా నిలి, ఎంఎస్‌థీసిస్ చేసారు. కాగా క శాఖాలలో ఆస్మాశిరిన్ టి భౌతిక శాస్త్రంలో స్పెషలైజేషన్‌తో 9.1 సిజిపిఏతో బియస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసారు. అర్జిత్ బెనర్జి భౌతికశాస్త్రంలో స్పెషలైజేషన్‌లో 8.6సిజిపిఏతో బియస్-ఎంఎస్ ప్రోగ్రాం చేసారు.వారికి మంగళవారం ఆవార్డులను అందించారు.

## రుయా ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సేవలు

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 5 ప్రభాతవార్త : పేద ప్రజలకు చేయూతను అందించాలన్న ఆశయంతో తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి మరో ఉచిత సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డాలర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి రుయా ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందుకోసం సిద్ధం చేసిన నూతన అంబులెన్స్ ను తుడా ఛైర్మెన్ పరిశీలించారు. రుయా ఆసుపత్రి లో రోగులకు ఉచితంగా అంబులెన్స్ సేవలను అందిస్తున్నామని ఈ సేవలను ఆసుపత్రికి వచ్చేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరో మూడు రోజుల్లో ఉచిత అంబులెన్సు సేవలు అందుబాటులోకి వస్తాయని దివాకర్ రెడ్డి తెలిపారు.



## సూర్యప్రభవాహనంపై నీలకంఠుడు



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యప్రభవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి సూచనలతో చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య ఉత్సవాలను సమయపాలనతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉద్యోగులు లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్,రవిలతో పాటు ఆలయ అర్చకులు జనార్ధన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యఘర్ పథకం ప్రజలకు చేరువ చేయాలి : కలెక్టర్



చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ సౌర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, సూర్యఘర్ పథకం ప్రణాళిక అమలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం, జిల్లా విజన్ ప్రణాళికలను పటిష్ట రూప కల్పనకు కృషి చేయాలన్నారు. పిఎం సూర్యఘర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలాఈ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించి గ్రౌండింగ్, సోలార్ పలకలు అమర్చడం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీలు వున్నారని, వీరితో పాటు బిసీ వర్గాల ప్రజలను సైతం రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఎపిఎస్‌పిడిసిఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఆయూబ్‌ఖాన్, సిజిఎం ప్రాజెక్ట్ నుండి రమాదేవి, ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్, రెస్కో ఎండి సోమశేఖర్, డిఓఎన్ఆర్ఇడిసిఏపి అబ్దుల్ గయాల్, మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్, అర్జున్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎస్ఎంఆర్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

## పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

పుత్తూరు రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త: ఏటా జరిగే పుత్తూరు ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుత్తూరు పురపాలక సంఘం తరపున శ్రీ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామివారి వివాహానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో పట్టు



వస్త్రాలు సమర్పించారు. పుత్తూరు పురపాలక సంఘం కార్యాలయం నుంచి ప్రారంభమై సదాశివేశ్వరాలయం మీదుగా ధర్మరాజుల స్వామి గుడి వద్దకు చేరుకుని పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవరత్నంనాయుడు, ఏఎంసీ చైర్మన్ గణేష్, మున్సిపల్ మాజీ చైర్మన్లు యుగంధర్, అంకయ్య, మాజీ వైస్ చైర్మన్ భాస్కర్, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, మాజీ ఎంపీపీ ఏళుమలై, కౌన్సిలర్ కేశవ ఆచారి, జనసేన కో-ఆర్డినేటర్ మహేష్, సర్పంచ్ బొబ్బిలి, టీడీపీ నాయకులు ప్రసాద్‌నాయుడు, దిలీప్, పార్దీబన్, ఈశ్వర్‌కుమార్, భాస్కర్, హరి తదితరులు పాల్గొన్నారు.

## అశ్వ వాహనంపై శ్రీ ద్రౌపదీదేవి ధర్మరాజుల స్వామి ఊరేగింపు

పుత్తూరు రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లు అశ్వ వాహనంపై ఊరేగించారు. ఉదయం ఆలయంలో పల్లకిసేవ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం కీర్తిశేషులు పి.వి.అరుణాచలం, మాజీ ఉపకులపతి, దవిడ విశ్వ విద్యాలయం వారి ఆశీస్సులతో ద్రౌపదీదేవి వైభవంగా కార్యక్రమం నిర్వహించారు. పురవీధుల్లో గెరిగె ప్రత్యేక



పుష్పాలతో ఊరేగించారు. ఆలయ ఆవరణలో హరికథ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం అనంతరం ఏకాంత సేవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపది సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న మహాభారత మండపంలో పుత్తూరు గీతా మందిరం ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు కార్యక్రమం నిర్వహించారు.